సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



జయహో... కీర్తిచక్ర శ్రీనివాస్

ఎర్రచందనం, గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌కు చెమటలు పట్టించిన కీర్తిచక్ర పురస్కార గ్రహీత పందిళ్లపల్లి శ్రీనివాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

8లో



ప్రతిభ చూపితే లక్షాధికారే..

డిగ్రీ చదివే విద్యార్థులు లక్షాధికారులు అయ్యే అవకాశాన్ని ఆర్‌జీఐ కల్పిస్తోంది. జాతీయ స్థాయిలో ఆర్‌జీఐ-90 పేరిట క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది.

8లో

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు



హత్యాయత్నం కేసులో కొబ్బరి బొండాల వ్యాపారికి పదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్.విజయబాబు గురువారం తీర్పు చెప్పారు.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సేవలపై అవగాహన పెంచండి

- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దిశానిర్దేశం
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు కార్యక్రమాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్వచ్ఛ సేవల్లో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకూ మూడు కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టర్ విడిది కార్యాలయంలో 'స్వచ్ఛతా హి సేవా - 2024' పోస్టర్‌ని ఆమె ఆవిష్కరించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ స్వచ్ఛ సేవల అమలుపై దిశా నిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మండల, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టాలని, స్వచ్ఛ సేవల్లో ప్రజల భాగస్వామ్యం, వారికి అవగాహన, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధికి దెబ్బతీస్తే ఆత్మహత్యలే గతి



అధికారుల ఎదుట పెట్రోల్ బాటిళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

గోపాలపురం: పదేళ్లుగా రోడ్డు పక్కన గుడిసెలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమపై అధికార టీడీపీ వర్గీయులు జులుం చెలాయిస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యలు చేసుకుంటామని స్థానిక గుడ్డిగూడెం వాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో టీడీపీ నాయకుడి బంధువు నాటుసారా, అక్రమ మద్యం విక్రయిస్తుండడంపై బీజేపీ మండల అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ నాయకుడి బంధువు అసలు మార్జిన్‌లో ఉన్న వ్యాపారాలన్నింటినీ తొలగించాలని వీఆర్వో, గ్రామ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి తమను తొలగించేందుకు పురిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జరిగితే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు వెనుదిరిగారు.

పాల డెయిరీకి రూ.10 లక్షల విరాళం

నల్లజర్ల: విజయవాడలో ముంపు బారిన విజయ పాల ఫ్యాక్టరీకి దాదాపు రూ.70 కోట్ల నష్టం వాటిల్లిందని, దాని పునర్నిర్మాణానికి జిల్లాలోని పాల రైతులు రూ.10 లక్షలు విరాళం అందిస్తున్నట్టు పాల రైతుల సంఘ అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరావు వెల్లడించారు. గురువారం నల్లజర్లలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రోజుకు 50 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. దీనిని మరింత పెంచాలన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) అత్యధిక ధర చెల్లిస్తుందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు నందమూరి రామకృష్ణ, అల్లూరి దుర్గారావు, యలమాటి ఆనంద్, మేనేజరు మూర్తి పాల్గొన్నారు.

ఏలేరులో 85.75 మీటర్ల నీరు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: ఎగువప్రాంతం నుంచి వరదనీరు తగ్గుముఖం పట్టడంతో గురువారం ఏలేరు ప్రాజెక్టులో 85.75 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. పరీవాహక ప్రాంతం నుంచి 2801 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.75 మీటర్లు, 24.11 టీఎంసీలకు 22.44 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ప్రాంతానికి 2875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతోపాటు విశాఖకు 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తగ్గిన గోదావడి

- ఎగువన తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 14.40 అడుగుల నీటి మట్టం
- 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల
- పెరవలి, కొవ్వూరు, సీతానగరం గ్రామాల్లో నీట మునిగిన పంటలు
- జిల్లా వ్యాప్తంగా 2,716 హెక్టార్లలో పంట నష్టం



ముక్కామలలో నీట మునిగిన దొండ పందిళ్లు, పామాయిల్ తోటలు

సాక్షి, రాజమహేంద్రవరం: నురగలు గక్కుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి తన వేగాన్ని కాస్త తగ్గించుకుని కొంత శాంతించింది. రెండు రోజుల పాటు భద్రాచలం వద్ద వరద ప్రవాహం పెరగడం, నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరడంతో ఆందోళన నెలకొంది. గురువారం ఉదయం నుంచి నీటి మట్టంలో తగ్గుదల కనిపించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 41.50 అడుగులకు చేరింది. కాటన్ బ్యారేజీ వద్ద సాయంత్రం 7 గంటల సమయానికి కాటన్ బ్యారేజ్ నీటి మట్టం 14.40 అడుగులకు చేరింది. కాలువలకు 9,200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. 13,77,656 క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. నీటి మట్టం 11.75 అడుగుల కంటే తగ్గితే రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉంది. శుక్రవారానికి మరింతగా తగ్గే అవకాశం ఉంది.

ముంపులోనే గ్రామాలు

- వరద ఉధృతి తగ్గినా గోదావరి పరీవాహక, లంక, లోతట్టు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. రాజమహేంద్రవరం నగరంలోని పుష్కర ఘాట్, కోటిలింగాల రేవు వద్ద నీటి ఉధృతి పెరగడంతో సందర్శకులను అనుమతించడం లేదు.
- పెరవలి మండలంలో ఇప్పటికే దిగువ లంకలు జలదిగ్బంధంలో ఉన్నాయి. మండలంలో సుమారు 10 గ్రామాల్లో సాగైన వేలాది ఎకరాల పంటలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అరటి గెలలకు ఒండ్రు మట్టి పట్టి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పూల తోటలు, ఆకుకూరలు, మిర్చి తోటలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దొండ, బీర, అనప పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. తమలపాకు తోటలు సైతం పూర్తి స్థాయిలో దెబ్బతినే అవకాశం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.
- తాళ్లపూడి మండలంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం, ప్రక్కిలం ర్యాంపు వద్ద ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో పల్లపు లంక భూముల్లో సాగవుతున్న పంటలు ముంపునకు గురయ్యాయి. వేగేశ్వరం మేరీమాత ఆలయం మెట్ల వద్దకు నీరు చేరింది.
- కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని గోదావరి ముంచెత్తింది. ఆలయాలన్నీ ముంపులోనే ఉన్నాయి. ఫలితంగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఆటంకం ఏర్పడింది.
- సీతానగరం మండలంలో కొండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బొబ్బిల్లంక వద్ద స్లూయిజ్ గేట్లు మూసుకుపోయాయి. పంటలు నీట మునిగాయి. రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చిన కొడేపూడి, రాపాక, రఘుదేవపురం, నల్గొండ, మిర్తిపాడు, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, కూనవరం గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. వరద నుంచి తేరుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

తగ్గుముఖం పట్టిన పశ్చిమ ఏలేరు..

కాకినాడ జిల్లా పెదపూడి మండలంలో ఏపీ త్రయం గ్రామంలోని వంతెన వద్ద పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. సోమవారం నుంచి రోజు రోజుకు పెరుగుతూ వచ్చిన వరద ఉధృతి గురువారం సుమారు రెండు అడుగుల మేర తగ్గినట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతితో రామేశ్వరం, ఏపీ త్రయం, కరకుదురు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో వరి పంట నీట ముంపునకు గురైంది. కాలువ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

40 గ్రామాల్లో వరద ప్రభావం

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 7 మండలాల్లోని 40 గ్రామాలపై గోదావరి వరద ప్రభావం చూపింది. ఆయా గ్రామాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు రూపొందించారు. వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంటున్నారు.



పెదపూడి మండలం ఏపీ త్రయం వంతెన వద్ద తగ్గుముఖం పట్టిన పశ్చిమ ఏలేరు కాలువ ఉధృతి

పంట	మండలాలు	ముంపు ప్రాంతాలు	దెబ్బతిన్న పంట (హెక్టార్లలో)
వరి	గోకవరం	5	620.00
వరి	కోరుకొండ	12	1200.00
వరి	సీతానగరం	14	800.00
చెరకు	సీతానగరం	1	20.00
వరి	నిడదవోలు	5	25.22
వరి	రాజమహేంద్రవరం	1	30.36
వరి	కడియం	1	20.00
వరి	రాజానగరం	1	2.00



ముమ్మిడివారిపాలెంలో నీట మునిగిన బొప్పాయి తోట



ముక్కామలలో నీటిలో మునిగిన కొబ్బరి, పామాయిల్ తోటలు

దివాన్‌చెరువు ఫారెస్టులోనే చిరుత

- ట్రాప్ కెమెరాలో కదలికల నమోదు
- కనిపించిన పాదముద్రలు
- పరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అటవీ శాఖ అధికారి భరణి

రాజానగరం: దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టులోనే చిరుతపులి సంచరిస్తోందని, దాని కదలికలు ఆ ప్రాంతంలో తాము అమర్చిన ట్రాప్ కెమెరాలో నమోదయ్యాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆ ప్రాంతంలో దాని పాద ముద్రలను కూడా గుర్తించామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాల్లో 50 ట్రాప్ కెమెరాలను, అవసరమైన బోన్లను ఏర్పాటు చేశామన్నారు. నివాస ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. చిరుత జాడ తెలుసుకుని బంధించేందుకు గట్టి కృషి చేస్తున్నామని, అంతేకాక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధిస్తున్నామన్నారు. చిరుత సంచారంతో లాలాచెరువు, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాల వెంబడి ఉన్న జాతీయ రహదారిపై ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్ఓ భరణి సూచించారు. ఇందుకు ఆయా వాహనాల వేగాన్ని నియంత్రిస్తూ బోర్డులు ఏర్పాటు చేశామని, అలాగే ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని, చిరుత సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతపులి



చిరుతను పట్టుకునేందుకు ఏర్పాటుచేసిన బోను



చిరుత పాదముద్ర



థర్మల్ డ్రోన్ కెమెరాను వినియోగిస్తున్న అధికారులు

హత్యలు, విధ్వంసాల పాలనను వ్యతిరేకించండి

- రైతన్నకు పరిహారం కేవలం రూ.పది వేలా?
- వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- శ్రీరంగపట్నం బురదకాలువ ముంపు ప్రాంతాల సందర్శన

మధురపూడి: హత్యలు, దాడులు, అక్రమ అరెస్టులతో సాగుతున్న కూటమి పాలనను ప్రజాస్వామికవాదులు ఖండించాలని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలవల్ల కోరుకొండ మండలం శ్రీరంగ పట్నం బురదకాలువకు గండ్లుపడిన ప్రాంతాలను పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. వరదల వల్ల పంటనష్టపోయిన రైతన్నలకు పరిహారంగా కేవలం ఎకరానికి రూ.10 వేలు మాత్రమే ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుందని ఎద్దేవా చేశారు. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే శ్రీరంగపట్నం బురదకాలువకు గండ్లు పడ్డాయన్నారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు, అప్పటి పాలకులు ఎందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ఇస్తానని ప్రకటించి, చేతులెత్తేయడం ప్రజలను మోసగించడమే అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత యూటర్న్ తీసుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యే అన్నారు. ఇటీవల వర్షాలకు రాజానగరం నియోజకవర్గంలో చాలామంది రైతులు నష్టపోయారన్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టం వచ్చిందన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తే ఉద్యమిస్తామన్నారు. వారిని తక్షణం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నంలో బురదకాలువకు పడిన గండ్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నాయకులు

ఆపరేషన్ @85!



కాతేరు పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నాగదేవి

- ఇన్‌సర్వీస్ కోటా తగ్గించే జీవోపై పీహెచ్‌సీ వైద్యుల శంఖారావం
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు
- పునరాలోచించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- దిగిరాకుంటే కార్యాచరణకు ప్రణాళిక

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ వైద్యరంగంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఇప్పటికే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న సర్కారు.. తాజాగా ప్రభుత్వ వైద్యుల కోటాపై రానున్న పీజీ సీట్లపై కూడా పేచీ పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇన్ సర్వీస్ కోటా సీట్లలో కోత విధిస్తూ సగానికి సగంగా రిజర్వేషన్ నిర్ధారిస్తూ.. తక్షణమే అమల్లోకి వచ్చేలా జీఓ 85ని విడుదల చేసింది. దీంతో గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు భగ్గుమంటున్నారు. గత ప్రభుత్వంలో సర్వీస్ కోటాకు అర్హత గల వైద్యులకు క్లినికల్ సీట్లకు 50 శాతం వరకు రిజర్వేషన్ కోటాగా పీజీ సీట్లను కేటాయించగా ఇప్పుడు కోటాను సగానికి తగ్గించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. సమ్మెకు సైతం సిద్ధమంటూ నోటీసులిచ్చేందుకు ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నారు.

జీఓ 85 ఏం చెబుతోందంటే..

నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రభుత్వ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మూడేళ్లు పనిచేసినా లేదా ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం రెండేళ్లుగా రెగ్యులర్ సేవలందించినా.. ఇన్ సర్వీస్ కోటాకు అర్హులుగా గుర్తిస్తారు. వీరికి పీజీ విద్యలో ప్రవేశానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఇన్ సర్వీసు కోటాను ప్రవేశపెట్టి క్లినికల్ సీట్లకు 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 50 శాతం వరకు రిజర్వేషన్ కల్పించారు. ఇదే విధానం గత ప్రభుత్వంలో కచ్చితంగా అమలు చేసి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రతి పీహెచ్‌సీకి రెండేసి వైద్యుల పోస్టులుండేలా నియామకాలు కూడా భారీగా చేపట్టారు.

సీట్లకు కోత..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ కోటాలో సగానికి కత్తెర వేసి క్లినికల్ సీట్లకు కేవలం 15 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 30 శాతం మాత్రమే పీజీ సీట్లలో రిజర్వేషన్ వర్తించేలా గత నెల జీఓ 85 విడుదల చేశారు. జీఓ అమలైతే చాలా మంది అర్హులకు **అన్యాయం జరుగుతుంది. వాస్తవానికి పీజీ పూర్తిచేసిన ప్రభుత్వ వైద్యులకు వివిధ స్థాయి ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులుగా నియమించుకునే వెసులుబాటు ఉండేది. కానీ కోటాను తగ్గించడంతో ఇటు ఉన్నత చదువులతో పాటు మెరుగైన** వైద్యం అందించే అవకాశాలు ప్రభుత్వరంగం పరంగా కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురుకానుంది.

కొనసాగుతున్న నిరసన

తూర్పుగోదావరి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 41 పీహెచ్‌సీలు ఉండగా 108 మంది వైద్యులు వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీల వైద్యులకు ఇబ్బందిగా మారిన జీఓ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. 108 మంది వైద్యులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ నెల 10 నుంచి మూడురోజుల పాటు విధినిర్వహణలో నల్లబ్యాడ్జీలతో వైద్యులు నిరసన తెలిపారు. శుక్రవారం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకపోయినట్లయితే పీహెచ్‌సీ వైద్యులు అత్యవసర సర్వీసులు మినహాయించి అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేస్తారు. ఈనెల 14వ తేదీన పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్యసేవలకు మాత్రమే పరిమితం చేయనున్నారు. ఈ నెల 15వ తేదీన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద చలో విజయవాడ ర్యాలీ జరుగుతుంది. ఈనెల 16వ తేదీ నుంచి జీఓ 85 రద్దు వరకు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుంది. ఇదే జరిగితే జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సామాన్యులకు అందే వైద్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. ఇప్పటికైనా కూటమి సర్కారు వైద్య రంగం, వైద్యులపై కక్షసాధింపు ధోరణి వీడాలని, జీఓ 85 రద్దు చేయాలని వైద్యులు కోరుతున్నారు.

జీఓ రద్దు చేయాల్సిందే..



ఇది మమ్మాటికీ చీకటి జీఓనే. గతంలో ఉన్న పీజీ సీట్ల కోటా శాతాన్ని పూర్తిగా తగ్గించేయడం దారుణం. కొత్త నిబంధనల ప్రకారం ఇస్తున్న కోటాలో కూడా క్లినికల్ పీజీ సీట్లలో కేవలం ఆరు విభాగాలకే పరిమితం చేయడం అన్యాయం. ప్రభుత్వం పునరాలోచించి జీఓ 85ని రద్దు చేసే వరకు నిరసన కొనసాగిస్తాం. ప్రభుత్వం చర్చలకు రాని పక్షంలో త్వరలో రాష్ట్రసంఘం సూచనలు మేరకు ముందుకు వెళ్తాం.

– డా.మౌనిక, అధ్యక్షురాలు, జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తులకు జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపిన కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు, టూ టౌన్, సర్పవరం, సామర్లకోట, తిమ్మాపురం, పోర్ట్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా 12 మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

శతాధిక వృద్ధురాలి మృతి


బులి వెంకయమ్మ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: శతాధిక వృద్ధురాలు, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతా బులి వెంకయమ్మ (101) స్థానికంగా గురువారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆమె సీపీ రెడ్డి ట్రస్ట్ తరఫున రాజమహేంద్రవరం, ఊబలంక ప్రాంతాల్లో 25 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమెకు మృతికి పలువురు నగర ప్రముఖులు సంతాపం తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వివాహిత మృతి

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు ఎర్రకోనేరు సమీపంలో బైక్‌పై నుంచి జారిపడి వివాహిత కుర్ర వరలక్ష్మి (38) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం బంగారయ్యపేటకు చెందిన వరలక్ష్మి, తన బంధువుతో కలసి అన్నవరం దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి తునిలో ఉన్న వరలక్ష్మి తల్లిదండ్రుల ఇంటికి వస్తుండగా ఆమె చున్నీ బైక్‌లో పడడంతో బైక్‌పై నుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

17 నుంచి మండల స్థాయి అధికారులకు శిక్షణ

సామర్లకోట: ఈ నెల 17వ తేదీ నుంచి 11 జిల్లాల్లోని మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుందని స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఏపీఎస్ ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ సూచనల మేరకు 17 నుంచి 19 వరకు ఒక బ్యాచ్, 23 నుంచి 25 వరకూ రెండో బ్యాచ్‌లో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలు నిర్వహిస్తామని చెప్పారు. మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ మేరకు మొదటి బ్యాచ్‌లో ప్రతి జిల్లా నుంచి ముగ్గురు ఎంపీడీఓలు, ముగ్గురు ఈఓపీఆర్డీలు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు చొప్పున 88 మందికి శిక్షణ ఉంటుందన్నారు. అదే విధంగా రెండో బ్యాచ్‌లో ప్రతి జిల్లా నుంచి ఇద్దరు ఎంపీడీఓలు, ఇద్దరు ఈఓపీఆర్డీలు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు 77 మందికి శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు పంచాయతీరాజ్ వ్యవస్థపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

జయహో... కీర్తిచక్ర శ్రీనివాస్

- పుట్టింది కాకినాడ, చదివింది రాజమహేంద్రవరం
- వీరప్పన్‌ను సజీవంగా బంధించిన ధీరుడు
- అటవీ ప్రాంత ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన సాహసి
- మరణానంతరం కీర్తిచక్ర ప్రదానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎవరి పేరు చెబితే కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు వణికిపోతాయో.. ఎవరి పేరు వినిపిస్తే ఏనుగులు సైతం ఘీంకరించకుండా ఉండిపోతాయో.. ఎవరి పేరు చెబితే ఎర్రచందనం కూడా వాసన రాకుండా ఉంటుందో.. అటువంటి వ్యక్తి వీరప్పన్‌కు చెమటలు పట్టించి చావు భయాన్ని దగ్గరి నుంచి చూపించిన ధీరుడు అతను. చనిపోయిన తరువాత కూడా ఎక్కడ లేచి వస్తాడోనని భయపడిన వీరప్పన్ అతని మొండం నుంచి తల నరికి వేరు చేసుకుని తీసుకు పోయాడంటే వీరప్పన్‌కి ఏవిధంగా ముచ్చెమటలు పట్టించాడో ఆ ధైర్యశీలి. అతనే రాజమహేంద్రవరం ముద్దుబిడ్డ, సాహసి, మరణానంతరం కీర్తిచక్ర బిరుదు పొందిన పందిళ్లపల్లి శ్రీనివాస్. గురువారం ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక స్మరణ ఇది.

కాకినాడలో 1954 సెప్టెంబర్ 12న శ్రీనివాస్ జన్మించారు. తండ్రి పందిళ్లపల్లి అనంతరావు, తల్లి జయలక్ష్మి. ప్రాథమిక విద్య అంతా రాజమహేంద్రవరం ఫిషర్స్ కాలనీ పాఠశాలలో సాగింది. 1975–77లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చదివి, బంగారు పతకాన్ని పొందారు. 1978లో యూపీఎస్సీ పరీక్షలు రాసి ఉత్తీర్ణుడై 1979లో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. 1981లో శ్రీనివాస్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. 1981లో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కర్ణాటక క్యాడర్ అధికారిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. చామరాజనగర్‌లో అసిస్టెంట్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్‌గా తొలి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అదే ఏడాది చిక్‌మంగళూరు కేంద్రంగా స్మగ్లింగ్ నిరోధక బాధ్యతలతో డిప్యూటీ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి పొందారు. అదనపు బాధ్యత అయినా అక్రమ రవాణా నిరోధాన్ని శ్రీనివాస్ చాలా శ్రద్ధతో నిర్వహించారు. ఆ క్రమంలో అదే అడవుల్లో ఏనుగులను చంపి, ఏనుగు దంతాలను అక్రమ రవాణా చేస్తున్న వీరప్పన్‌ని ఎదుర్కొన్నారు. నిజాయితీ గల అధికారిగా అటవీ గ్రామాల్లోని ప్రజల మన్ననలను చూరగొన్నారు. 1985లో వీరప్పన్‌ను శ్రీనివాస్ పట్టుకుని, మైసూరు జిల్లా బూదిగపాడు అటవీశాఖ అతిథి గృహంలో బంధించాడు. అయితే వీరప్పన్ చాకచక్యంగా నిర్బంధం నుంచి తప్పించుకున్నాడు.

అమెరికా పర్యటన

శ్రీనివాస్ తన ఉద్యోగ బాధ్యతలు కొనసాగిస్తూ, 1989లో అమెరికాకు పరిశోధనల కోసం వెళ్లారు.



కర్ణాటకలో శ్రీనివాస్ కాంస్య విగ్రహం

అడవుల్లో కార్చిచ్చు, కాలిపోతున్న అడవులను పరిరక్షించే చర్యలు వంటి అంశాలపై పరిశోధించడానికి అమెరికాలో పర్యటించారు. 1990లో అటవీశాఖ అభ్యర్థన మేరకు భారత దేశానికి హుటాహుటిన తిరిగివచ్చారు. అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, వీరప్పన్‌ను పట్టుకునేందుకు కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సులో ప్రత్యేకాధికారిగా ఉండాలంటూ శ్రీనివాస్‌ను ప్రభుత్వం పిలిచింది. దాంతో అతను అమెరికా నుంచి భారత దేశానికి తిరిగి వస్తూనే సొంతూరైన రాజమహేంద్రవరానికి కూడా వెళ్లకుండా నేరుగా కర్ణాటక వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.

అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

అక్రమ రవాణా నిరోధానికి అధునాతన సౌకర్యాలతో 'వాచ్ టవర్లు' ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఉద్యోగుల నివాసాలకు, విధులకు అందుబాటులో ఉండడానికి చామరాజనగర్‌లో 'ఫారెస్ట్ కాంప్లెక్స్' నిర్మించారు. వీరప్పన్ అనుచరులను దెబ్బతీయడం, వెతుకులాట పెంచడం, ఉద్యోగులను మరింత సమర్థంగా పనిచేసేలా చేయడం వంటి చర్యలను శ్రీనివాస్ తీసుకున్నారు. దీంతో వీరప్పన్ అక్రమ రవాణాను దెబ్బతీశాయి.

వ్యూహం పన్ని..

శ్రీనివాస్‌ను దెబ్బతీయడానికి ఏ రకంగా వీలుచిక్కకపోవడంతో, మోసగించి దెబ్బతీయడానికి వీరప్పన్ సిద్ధమయ్యాడు. వీరప్పన్ సహచరుడు అర్జున్‌తో శ్రీనివాస్ ఒంటరిగా వస్తే లొంగిపోతానని వీరప్పన్ కబురు పంపాడు. శ్రీనివాస్ 1991 నవంబర్ 10వ తేదీ తెల్లవారుజామున గోపీనాథం సమీపంలోని నెమళ్ల కొండ వద్దకు వెళ్లారు. శ్రీనివాస్‌ను చూడగానే వీరప్పన్ ఇచ్చిన సూచనలు అందుకుని అతని అనుచరుడు పలాండీ తుపాకీతో కాల్చి చంపాడు. అతని వెన్నంటే వచ్చిన మరో ముగ్గురు అటవీ శాఖ ఉద్యోగులను కూడా దారుణంగా చంపేశారు. శ్రీనివాస్ తలను మొండెం నుంచి వేరుచేసి వీరప్పన్ తీసుకుని అడవుల్లోకి వెళ్లిపోయాడు. వీరప్పన్ ఆయనను హతమార్చిన చోట స్మారక స్థూపాన్ని ప్రభుత్వం నిర్మించింది. 1992లో కేంద్ర ప్రభుత్వం శ్రీనివాస్‌కు కీర్తి చక్ర (మరణానంతరం) అవార్డును ప్రకటించింది. పందిళ్లపల్లి శ్రీనివాస్ పేరున రాజమహేంద్రవరంలోని అశోక్ సినిమా థియేటర్ పక్కన ఓ వీధి ఉంది. ఆయన జీవిత చరిత్రను, ధైర్య సాహసాలను కొత్తగా శిక్షణకు వచ్చే ఐఏఎస్, ఐపీఎస్‌లకు బోధిస్తున్నారు. శ్రీనివాస్ వర్ధంతిని పురస్కరించుకుని నవంబర్ 10న జాతీయ అటవీ శాఖాధికారుల అమరవీరుల సంస్మరణ దినంగా ప్రభుత్వం ప్రకటించింది.


కీర్తిచక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్ (ఫైల్)

చాలా గర్వంగా ఉంది



శ్రీనివాస్ మా అన్నయ్య అని చెప్పుకోవడానికి చాలా గర్వంగా ఉంది. నీతి, నిజాయితీకి మారు పేరుగా నిలిచారు. చనిపోయి ఇన్నేళ్లయినా ఇప్పటికీ ఆయనను జనం గుర్తు పెట్టుకుంటున్నారంటే ఆయనపై అభిమానం, ప్రేమ వెలకట్టలేనిది. మా అన్న అంటే నాకు, నా ఇద్దరి చెల్లెళ్లకు చాలా ఇష్టం.

– పందిళ్లపల్లి సత్యనారాయణ, రాజమహేంద్రవరం

ఆయన గురించి పాఠాలు బోధించాలి



కీర్తిచక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్ ధైర్య, సాహసాలు నేటి విద్యార్థులకు పాఠాలుగా బోధించాలి. కింది స్థాయి నుంచి పైస్థాయికి వెళ్లినా ఎక్కడా కూడా గర్వం అనేది లేకుండా ఆయన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. రాజమహేంద్రవరం వాస్తవ్యుడు కావడం మనందరికీ గర్వకారణం.

– డాక్టర్ సంజీవరావు, రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో ఘన నివాళి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థి కీర్తి చక్ర అవార్డు గ్రహీత పందిళ్లపల్లి శ్రీనివాస్ జయంతిని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ తమ కళాశాలలో వృక్షశాస్త్రం చదివిన శ్రీనివాస్ కర్ణాటక, తమిళనాడుల్లో ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా ఎర్ర చందనం, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఫారెస్ట్ అధికారులు హారిక, శ్రీనివాస్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు మాధవ్, వృక్ష శాస్త్ర అధిపతి శ్రీనివాస్, పందిళ్లపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాలలో పందిళ్లపల్లి శ్రీనివాస్‌కు నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, తదితరులు

ప్రతిభ చూపితే లక్షాధికారే..

- డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు
- లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పించి క్విజ్ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న లీడ్ బ్యాంక్ సిబ్బంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డిగ్రీ చదివే విద్యార్థులు లక్షాధికారులు అయ్యే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయిలో ఆర్‌బీఐ–90 పేరిట క్విజ్ పోటీలు నిర్వహిస్తుంది. ఈ పోటీలను ఆన్‌లైన్ ద్వారా దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆర్‌బీఐ సంస్థ ఏర్పడి 90 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా క్విజ్ పోటీలు పెడుతుంది. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఈ నెల 17వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. జిల్లాలో పలు డిగ్రీ కళాశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

పోటీలు ఎలా అంటే..

ఆర్‌బీఐ నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 19 నుంచి 21వ తేదీ రాత్రి 9 గంటల వరకూ ఆన్‌లైన్ పోటీలు జరగనున్నాయి. విద్యార్థుల్లో రిజర్వ్ బ్యాంక్, ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీలు, సురక్షితం, బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ పోటీలు నిర్వహిస్తోంది. 2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్ల లోపు వయసు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులుగా నిర్ణయించారు. కళాశాల నుంచి ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బృందానికి ఇద్దరు ఉండాల్సి ఉంటుంది. నాలుగు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో జరుగుతాయి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఇంగ్లిష్, హిందీ భాషల్లో పోటీలు ఉంటాయి. ఈ పోటీల్లో దేశ, అంతర్జాతీయ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, క్రీడలు, సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై క్విజ్ పోటీలు ఉంటాయి.

బహుమతులు ఇవే..

జిల్లా స్థాయిలో విజయం సాధించే విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతారు. అనంతరం ప్రాంతీయ, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం రూ.2 లక్షలు, ద్వితీయ స్థానం రూ.1.50 లక్షలు, తృతీయ స్థానం రూ.లక్ష, ప్రాంతీయ స్థాయిలో ప్రథమ స్థానం రూ.5 లక్షలు, ద్వితీయ స్థానం రూ.4 లక్షలు, తృతీయ స్థానం రూ.3 లక్షలు, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రూ.10 లక్షలు, ద్వితీయ స్థానం రూ.8 లక్షలు, తృతీయ స్థానం రూ.6 లక్షలు అందజేస్తారు.

వెబ్‌సైట్: www.rbi90quiz.in

ఉమ్మడి జిల్లా వివరాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	:	18
ఎయిడెడ్	:	2
విద్యార్థులు	:	12,000
ప్రైవేట్ కళాశాలలు	:	125
విద్యార్థులు	:	1,46,000

ఇదో మంచి వేదిక



జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలకు సమాచారం ఇచ్చాం. సంబంధిత కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్‌తో సమావేశమై ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ చేసుకుని పోటీలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరాం. విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటుతో పాటు వారి ప్రతిభను వెలికితీయడానికి ఇది మంచి వేదికగా నిలుస్తోంది.

– చందాల శ్రీవెంకట ప్రసాద్, ఎల్‌డీఎం, కాకినాడ జిల్లా

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

పెదపూడి: రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం కె.కల్యాణి, పీడీ ఎ.రాజేశ్వరి తెలిపారు. గురువారం అనపర్తిలో వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన టెన్నికాయిట్ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు బి.అంకిత, టి.వి నీల ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. వారిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కల్యాణి

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: హత్యాయత్నం కేసులో కొబ్బరి బొండాల వ్యాపారికి పదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.విజయబాబు గురువారం తీర్పు చెప్పారు. ఆ వివరాల ప్రకారం.. 2023 మార్చి 17న అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నారావు కాకినాడ ఎండోమెంట్స్ సంయుక్త కమిషనర్ కార్యాలయం గేటు ఎదుట వాహన తనిఖీలు చేస్తున్నారు. అక్కడే ఉన్న టాటా ఏస్ వాహనం గురించి తన ట్యాబ్‌లో చెక్ చేయగా ఇన్‌స్రూ పొల్యూషన్ అయిపోయినట్లు గుర్తించారు. ఆ వాహనం పక్కనే కొబ్బరి బొండాలు అమ్మే వ్యక్తిని పిలిచి రికార్డు చూపమనగా, ఆ వ్యక్తి తన వద్ద రికార్డు లేదని చెప్పాడు. దీంతో చిన్నారావు హోంగార్డ్‌ను పిలిచి ఆ టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి ఆఫీస్‌కు తీసుకు వెళ్లాలని ఆదేశించారు. దీంతో కొబ్బరి బొండాలు అమ్మే వ్యాపారి పెంటా వెంకట దుర్గాప్రసాద్ రోడ్డు పక్కన పెట్టి, వినియోగించకుండా ఉన్న వాహనాన్ని సీజ్ చేస్తారా? అంటూ ప్రశ్నించాడు. ఆవేశంతో టాటా ఏస్ వాహనంలో నుంచి కొబ్బరి బొండాలు కొట్టడానికి వాడే పదునైన కత్తి తీసి దాడి చేయగా కారు అద్దం పగలగా, ఇన్‌స్పెక్టర్ చిన్నారావుపై కత్తితో దుర్గాప్రసాద్ దాడి చేశాడు. దీనిని ఆపడానికి వచ్చిన కారు డ్రైవర్ గుత్తుల వీర వెంకట సత్యనారాయణను చేతులపై నరికాడు. కాకినాడ టూ టౌన్‌లో వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కోర్టులో దుర్గాప్రసాద్ నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

కి'లేడీ' అరెస్ట్

రామచంద్రపురం రూరల్: ఒక వృద్ధురాలి మెడలో సినీ ఫక్కీలో గొలుసు లాక్కున్న యువతిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్ కథనం ప్రకారం.. మాచర గ్రామానికి చెందిన వృద్ధురాలు గుత్తుల దమయంతి గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తన కుమార్తెతో కలసి వచ్చింది. వైద్యం చేయించుకున్న అనంతరం యనదల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్దామని బయలు దేరారు. రామచంద్రపురం శీలం వారి సావరం దారిలో వెళుతుండగా కరెంట్ ఆఫీసు సమీపంలో ఎండ తీవ్రతకు అలుపు వచ్చి సిమెంట్ బల్లపై విశ్రాంతి కోసం కూర్చుని ఉండగా ఒక యువతి బురఖా ధరించి స్కూటర్‌పై వచ్చి వృద్ధురాలి కంట్లో కారం చల్లి ఆమె మెడలో గొలుసు లాక్కుని పారిపోబోయింది. వృద్ధురాలి కూతురు కేకలకు అప్రమత్తమైన స్థానికులు ఆ యువతిని పట్టుకుని పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ అశోక్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధిత వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ అశోక్‌కుమార్

కారు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌కు చెందిన నడిమింటి సింహాద్రి (68), యడ్ల వెంకటగిరిలు మోటార్ సైకిల్‌పై దివాన్‌చెరువు వద్ద తాపీపనికి బయలుదేరారు. ఆటోనగర్ సెంటర్‌కు వచ్చేసరికి వెనుక నుంచి కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నడిమింటి సింహాద్రి తీవ్రంగా గాయపడగా, యడ్ల వెంకటగిరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. సింహాద్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన కోర్ని శివ బహిర్భూమికి వెళ్తుండగా స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద విశాఖపట్నం వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విశాఖపట్నంకు చెందిన శివ ప్రత్తిపాడులో సోదరి ఇంటి వద్ద ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

మోటార్ సైక్లిస్ట్ దుర్మరణం

గండేపల్లి: తాళ్లూరులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మోటార్ సైక్లిస్ట్ మృతి చెందినట్లు గండేపల్లి అడిషనల్ ఎస్సై పరమహంస తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన కొల్లిబోయిన సత్యనారాయణ (49) మోటార్ సైకిల్‌పై మల్లేపల్లి నుంచి చిత్రాడ వెళుతుండగా తాళ్లూరు వచ్చేసరికి ఫిట్స్ వచ్చి కిందపడి గాయపడి మృతి చెందాడు.

బావిలోకి దూకి బాలిక ఆత్మహత్య


మృతి చెందిన దుర్గాభవాని

ప్రత్తిపాడు రూరల్: బావిలోకి దూకి బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రత్తిపాడులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన బత్తిన దుర్గాభవాని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఉదయం తండ్రి బత్తిన వీరబాబు దుర్గాభవానిని రోజులాలానే స్కూల్‌కు తీసువచ్చి వదిలిపెట్టి వెళ్లాడు. సాయంత్రం స్కూల్ అనంతరం ఇంటికి వస్తూ ఇంటికి సమీపంలోని బావిలోకి దుర్గాభవాని దూకింది. స్థానికులు గుర్తించి తల్లికి సమాచారం అందించడంతో స్థానికుల సహకారంతో దుర్గాభవానిని బయటకు తీసి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి వుంది. బాలిక తండ్రి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు


యర్నగూడెంలో బస్సు కింద ఉన్న బైక్

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వెళుతున్న గ్రామానికి చెందిన గాడి వెంకటశ్రీనును పంచాయతీ సమీపంలో ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటశ్రీను తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ దుర్మరణం


బొండాయికోడు కాలువలో బోల్తా పడిన ఆటో

ముమ్మిడివరం: ఓ ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ రమణాతి ఉమామహేశ్వరరావు (40) తన ఆటోలో అమలాపురం వైపు వెళుతుండగా, అదుపు తప్పి బొండాయి కోడు కాలువలో బోల్తా పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఏడుగురి అరెస్ట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చోరీలకు పాల్పడుతున్న ఏడుగురిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఆ వివరాలను స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.దుర్గారావు తెలిపారు. నగర పరిసర ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ల వద్ద ఎలక్ట్రిక్ వైర్ల దొంగతనాలు జరుగుతున్నాయని పోలీసులకు ఇటీవల ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఐ దుర్గారావు ఆధ్వర్యంలో క్రైం పార్టీ పోలీసులు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబు నిఘా పెట్టారు. ఆవ రోడ్డులో ఉన్న కార్ మెమో షెడ్ వద్ద నిందితుల కదలికలు గుర్తించారు. అక్కడ కోటిలింగాలపేటకు మణికంఠరాజు, కుసుమ శశాంత్, ఆవరోడ్డు వాంబే కాలనీకి చెందిన కుక్కల చిన్నిలను పట్టుకున్నారు. వీరిని దొంగతనం కేసులో అరెస్టు చేశారు. వీరితో పాటు దొంగతనానికి పాల్పడిన ఏపీ పేపర్‌మిల్ వాంబే గృహాలకు చెందిన షేక్ కరీం, బొల్లంకల శ్రీనివాస్, కోటిలింగాలపేటకు చెందిన సారికరోహిత్, గుంజే వెంకటేష్‌లను గంజాయి కేసులో అరెస్ట్ చేశారు. వీరిపై రాగి వైరు దొంగతనంతో పాటు గంజాయి కలిగి ఉండడంతో ఆ కేసునూ పెట్టారు. వీరితో పాటు ఉన్న కోటిలింగాలపేటకు చెందిన మోతా శ్రీరామ్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి ప్రకాశ్‌నగర్, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లోని చోరీకి గురైన 20 కిలోల రాగి వైరును సీజ్ చేశారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న టూ టౌన్ సీఐ దుర్గారావు